# హైవే గోతులమయం

తాటిచెట్లపాలెం నుంచి గురుద్వారా వరకు అధ్వానంగా జాతీయ రహదారి


భారతీయ విద్యా భవన్ స్కూల్ సమీపంలో హైవేపై గోతులు


తాటిచెట్లపాలెం సమీపంలో చర్చి ఎదురుగా జాతీయ రహదారిపై భారీ గుంత

తాటిచెట్లపాలెం : సాఫీగా ప్రయాణం సాగిపోవాల్సిన జాతీయ రహదారి గోతులమయం కావడంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. తాటిచెట్లపాలెం నుంచి గురుద్వారా వరకు గల రహదారి గోతులతో భయంకరంగా ఉంది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనాలు, శరీరాలు హూనమయ్యే పరిస్థితి నెలకొంది. దాదాపు రెండు కిలోమీటర్ల దూరం గల రహదారిలో సుమారు వందకు పైనే గోతులున్నాయి. రాత్రి వేళల్లో ఈ గోతులు కనిపించక వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అసలే హైవే ప్రయాణం వేగంగా సాగిపోవచ్చని భావిస్తూ స్పీడ్‌గా వస్తున్న వారు గోతులు కనిపించగానే హఠాత్తుగా బ్రేకులు వేయడం, లేదా గోతుల్లో వాహనాలతో పడిపోవడం జరుగుతోంది. కొన్ని చోట్ల ప్యాచ్ వర్క్‌లు చేసినా ఎగుడుదిగుడుగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయంలో స్పందించకపోవడంతో నగరవాసులు అసహనానికి గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్నీ బాగున్నా భూతద్దంలో చూపించిన వారికి ఈ పరిస్థితి కనిపించడం లేదేమో అని గుసగుసలాడుకుంటున్నారు. సమస్యలపై స్పందించడం మానేసి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా నాయకులు ప్రవర్తిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులు పూడ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


అక్కయ్యపాలెం సమీపంలో బంక్ వద్ద గోతులు


పోర్టు స్టేడియం ఎదురుగా ఐసీఎఫ్ఏఐ భవన్ సమీపంలో జాతీయ రహదారిపై గోతులు

### వేగంగా వస్తే ప్రమాదాలే

సుమారు రెండు మూడు వారాల నుంచి ఈ రహదారులు చాలా దారుణంగా తయారయ్యాయి. ఈ గోతులు పూడ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. తాటిచెట్లపాలెం నుంచి అక్కయ్యపాలెం వరకు ఎన్ని గోతులున్నాయో, ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియడం లేదు. రోడ్డు బాగా ఉందని వేగంగా వస్తే ప్రమాదాలకు గురికావాల్సిందే. అధికారులు స్పందించి వెంటనే గోతులు పూడ్చాలి.

– పి.ప్రవీణ్, తాటిచెట్లపాలెం

### వెంటనే గోతులు పూడ్చాలి

అసలే వర్షాకాలం. ఇప్పటికే పలుచోట్ల జాతీయ రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. గోతుల్లో దిగడంతో వాహనాలు పాడైపోతున్నాయి. కొన్ని సార్లు ఈ గోతుల్లో వర్షపు నీరు చేరడంతో అక్కడ రోడ్డు పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోలేకపోతున్నాం. కొందరు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే ఈ గోతులను పూడ్చాలని కోరుకుంటున్నాం.

– ఎం.సింహాచలం, అక్కయ్యపాలెం

## పాలిటెక్నిక్ విద్యతో ఉజ్వల భవిష్యత్

సీఐఐ ఏపీ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వూన మురళీకృష్ణ


సివిల్ ఇంజినీరింగ్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న సీఐఐ ఏపీ చాప్టర్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ

మురళీనగర్ : ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవడానికి పాలిటెక్నిక్ విద్యను మంచి అవకాశంగా తీసుకోవాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఏపీ చాప్టర్ చైర్మన్, గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ వూన మురళీకృష్ణ సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన సివిల్ ఇంజినీరింగ్ ఫెస్ట్ గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ డిప్లమా విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మారుతున్న టెక్నాలజీని తెలుసుకోవాలన్నారు. నైపుణ్యం ద్వారా సమస్యలను సకాలంలో పరిష్కరించడంతోపాటు నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని వివరించారు. సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలని సూచించారు. పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ నిర్వహణకు సీఐఐ తరుపున సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఎంచుకున్న రంగంలో సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌పీసీఎల్ నైపుణ్యాభివృద్ధి విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ ఇంతియాజ్ హర్షద్ మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన యువత కోసం ప్రపంచం ఎదురుచూస్తోందని, అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సాంకేతిక నైపుణ్యాలతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్ వర్క్ అవసరమని సూచించారు. డాక్టర్ పూజిత మాట్లాడుతూ వ్యక్తిగత అభివృద్ధి ద్వారా నిర్దేశిత లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. విద్యార్థికి స్థిరమైన ఆలోచనలు, ఆత్మస్థైర్యం అవసరమని చెప్పారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి రాజేంద్రప్రసాద్, స్టూడెంట్స్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## దుర్గాదేవి మట్టి విగ్రహాలు తయారీ


శంకరమఠం వద్ద కలకత్తా కళాకారులు తయారు చేస్తున్న మట్టి విగ్రహాలు

సీతంపేట: దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తుండడంతో కలకత్తా మట్టి విగ్రహాల తయారీ జోరందుకుంది. వచ్చే నెల 3 నుంచి ప్రారంభమయ్యే మహోత్సవాలకు దుర్గాదేవి విగ్రహాలకు కళాకారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. వినాయక చవితిలాగే దుర్గా నవరాత్రులు కూడా తొమ్మిది రోజులపాటు నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా యూత్ అసోసియేషన్లు, కాలనీలు, వీధుల్లో మండపాలు నిర్మించి ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. ఆటో, లారీ, ట్రాన్స్‌పోర్ట్, కార్మిక సంఘాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లోని ఉద్యోగులు దుర్గా నవరాత్రులు పెద్ద ఎత్తున జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు అవసరమైన దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలకు కలకత్తా కళాకారులు శంకరమఠం వద్ద తుది మెరుగులు దిద్దుతూ బిజీగా ఉన్నారు. ఆర్డర్ల మేరకు విగ్రహాలు తయారు చేస్తున్నామని శిల్పి కోకోన్ దిండా తెలిపారు. సీతంపేట, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో ఉత్సవాలకు మండపాలు నిర్మిస్తున్నారు.

## క్లుప్తంగా

### రైతుబజారులో 8 మంది రైతులపై కేసులు


బజారులో కాటా తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రామారావు

సీతమ్మధార : స్థానిక సీతమ్మధార రైతుబజారులో తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ రామారావు రైతుల ధర్మకాటాలు పరిశీలించారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం కౌంటర్‌లోని కాటాలుతోపాటు ఇతర వ్యాపారుల కాటాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8 మంది రైతులపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కాటాకు సీల్ వేయించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామన్నారు. కూరగాయల తూకంలో తప్పులు జరిగినా, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు పాల్గొన్నారు.

### మంచి పాలన అందించాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మద్దిలపాలెం : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంద రోజుల్లో మంచి పాలన అందించామని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 51వ వార్డు పరిధి మాధవస్వామి కళ్యాణమండపంలో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో ప్రజలు కూడా అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు.

### 3 నుంచి నవరాత్రి మహోత్సవాలు

సీతమ్మధార : దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల శ్రీమహాగణపతి ప్రసన్న వేంకటేశ్వర, శ్రీఅయ్యప్ప, శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో అక్టోబర్ 3 నుంచి శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు, అర్చకులు రాజాస్వామి తెలిపారు. 3 నుంచి 12 వరకు రోజూ 6 గంటల నుంచి ''దుర్గా హోమం'' అనంతరం అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. నవరాత్రులలో రోజూ అన్నసంతర్పణ నిర్వహిస్తామని తెలిపారు.

మద్దిలపాలెం : శ్రీ కుంచాలమ్మ, దుర్గాలమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ మూడు నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు 104 ఏరియాలో 3 నుంచి 12 వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తామని, అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

### భార్య అదృశ్యంపై ఫిర్యాదు


రేణుక

మద్దిలపాలెం : తన భార్య అదృశ్యమైందని ఓ భర్త కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం పరిధి కప్పరాడ సురేష్‌రాం నగర్‌లో కార్తీక్ అనే వ్యక్తి భార్య, పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 25న ఉదయం 8 గంటలకు ఆటో వేయడానికి వెళ్లిపోయాడు. అనంతరం 9 గంటలకు పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లిన రేణుక తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గీత కులాలకు 20 శాతం మద్యం షాపులు కేటాయించాలి


మాట్లాడుతున్న కట్టా మల్లేశ్వరరావు

సీతంపేట : గీత కులాలకు 20 శాతం మద్యం షాపులు కేటాయించాలని శెట్టిబలిజ సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు కట్టా మల్లేశ్వరరావు కోరారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాకినాడ కోరంగిలో జరిగిన శెట్టిబలిజ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే గీత కులాలకు (శెట్టిబలిజ, గౌడ, శ్రీశైన, ఈడిగ, యాత) 20 శాతం మద్యం షాపులు కేటాయిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ మేరకు రాష్ట్రంలో 20 శాతం మద్యం షాపులు కేటాయించాలని కోరారు. ప్రస్తుతం 10 శాతం అంటే 340 షాపులు మాత్రమే కేటాయిస్తామని ప్రభుత్వం తెలిపిందన్నారు. అలాగే మద్యం షాపుల్లో ఆర్థికంగా వెనుకబడిన గీత కులాలకు చెందిన వారు పనిచేసే అవకాశం కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలను గుర్తించి దామాషా ప్రకారం 40 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు కడలి సుబ్బారావు, కట్టా శ్రీకాంత్, కంకటాల బాలసాయి, అప్పారి శ్రీవిద్య, మధుగౌడ్, బమ్మిడి రమణ, కొలుసు అచ్చిబాబు, సత్యనారాయణ, బొంగు రాజారావు, చెల్లిబోయిన నాగేశ్వరరావు, గుత్తుల గిరి పాల్గొన్నారు.

## మహాధర్నా కరపత్రం ఆవిష్కరణ


సీతమ్మధారలో కరపత్రం ఆవిష్కరిస్తున్న శివప్రసాదరావు, తదితరులు

సీతమ్మధార : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన నిర్వహించాలని కోరుతూ విజయవాడలో అక్టోబర్ 10న మహాధర్నా చేస్తున్నట్లు బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెదపెంకి శివప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు సీతమ్మధారలోని పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో కులగణన నిర్వహించి బీసీలకు జనాభా ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు రిజర్వ్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో కులగణన నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. విద్య, ఉద్యోగాలు, పదోన్నతుల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. మహాధర్నా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అన్వేష్, ధనుంజయ్ రావు, ఉపాధ్యక్షుడు రామచంద్రరావు, కోశాధికారి కనకమహాలక్ష్మి, రమేష్, తాతారావు పాల్గొన్నారు.

## కుండపోత వర్షంతో అవస్థలు

- రోడ్లపై నిలిచిపోయిన నీరు
- పొంగి ప్రవహించిన గెడ్డలు, డ్రెయిన్లు
- రాకపోకలకు నగరవాసులకు ఇబ్బందులు


రేసపువానిపాలెం వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు


పౌర గ్రంథాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు


శ్రీనగర్ రోడ్‌లో ప్రవహిస్తున్న వర్షపు నీటిలో వాహన చోదకులు


నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిలిచిన నీరు


వినియోగదారులు లేక బోసిపోయిన సీతమ్మధార రైతుబజార్

సీతంపేట : వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నగరం తడిసి ముద్దయింది. బుధవారం మొదలైన వర్షం గురువారం కూడా తెరిపివ్వకుండా కురిసింది. ఫలితంగా రహదారులన్నీ జలమయమవడంతోపాటు డ్రెయిన్లు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. వర్షపు నీరు రహదారులపై ఏరులా ప్రవహించడంతో జనం అవస్థల పాలయ్యారు. రామాటాకీస్ నుంచి ద్వారకానగర్ వెళ్లే శ్రీనగర్ రోడ్డు, పౌర గ్రంథాలయం వద్ద వర్షపు నీరు ఏరులై ప్రవహించడంతో రాకపోకలు సాగించేందుకు జనం ఇబ్బంది పడ్డారు. అలాగే శంకరమఠం రోడ్, సీతంపేట, గురుద్వారా రహదారులు జలమయమయ్యాయి. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో ఉద్యోగులు, వ్యాపారులు తమ విధులకు, అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఉరుములు, మెరుపులతో భయాందోళన**

సీతమ్మధార : ఉరుములు, మెరుపులతో గురువారం ఉదయం నుంచి తెరిపివ్వకుండా కురిసిన వర్షంతో నగరవాసులు భయాందోళనకు గురయ్యారు. దీనికితోడు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఇళ్లల్లో అవస్థలపాలయ్యారు. జీవీఎంసీ 14, 24వ వార్డుల్లోని జాతీయ రహదారితోపాటు ఇతర రోడ్లపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నక్కవానిపాలెంలోని చిరు వ్యాపారులు వర్షం కారణంగా తోపుడు బళ్లు తెరవ లేదు. అలాగే సీతమ్మధార రైతుబజారులో వ్యాపారాలు లేక వినియోగదారుల కోసం రైతులు ఎదురు చూశారు. నక్కవానిపాలెం క్రాంతి నగర్, గాంధీనగర్, రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, టీపీటీ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ చెరువులా తయారైయింది. 14వ వార్డులోని బాలయ్య శాస్త్రి లేఅవుట్, నార్త్ ఎక్స్‌టెన్సన్, గణేష్‌నగర్, సీతమ్మధార, ఏఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, రాధాకృష్ణ లే అవుట్ తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాలువల్లోని మురుగు నీరు రోడ్లపైకి వచ్చేయడంతోపాటు గోతులు కనిపించక రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిరువ్యాపారులు ఉపాధి లేక అవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్‌లు, రోడ్ల మీద వ్యాపారాలు చేసుకునే వారు దుకాణాలు ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది.

## యూజీడీ లీక్‌తో రోడ్డుపైకి మురుగునీరు


బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో యూజీడీ పైకప్పు ఎగిరిపోవడంతో బయటకొచ్చిన మురుగునీరు


నార్త్ ఎక్స్‌టెన్సన్ రోడ్డులో లీకవుతున్న యూజీడీ మురుగునీరు

దుర్వాసన భరించలేక స్థానికులకు అవస్థలు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో యూజీడీ వ్యవస్థ అధ్వానంగా తయారైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. 14వ వార్డులోని షిర్డీసాయిబాబా ఆలయం రోడ్డులో యూజీడీ లీకవడంతో రోడ్డంతా మురుగునీటితో నిండిపోయింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, వాహన చోదకులు దుర్వాసన భరించలేక అవస్థలు పడ్డారు. అలాగే సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే అవుట్, ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ దరి చాకలిగెడ్డ ఎదురుగా గల యూజీడీ పైకప్పు ఎగిరిపోవడంతో మురుగునీరు లీకవ్వడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయనందునే ఈ ప్రాంతాల్లో తరచూ యూజీడీ లీకవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఒకే వార్డులో రెండు మూడు చోట్ల యూజీడీ లీకవడం గమనార్హం. జోన్ పరిధిలో ఏదో ఒక వార్డులో నిత్యం యూజీడీ లీకవ్వడం సాధారణ విషయంగా మారిపోయిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## నిస్వార్థ కళా సేవకుడు చెన్నా


చెన్నా తిరుమలరావును సత్కరిస్తున్న అచ్యుతరావు

సీతంపేట : మూడున్నర దశాబ్దాలుగా సాంస్కృతిక రంగానికి చెన్నా తిరుమలరావు అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమైనవని ఉపకార్ ట్రస్ట్ అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు అన్నారు. ఫ్యామిలీ మెలోడీస్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అక్కయ్యపాలెంలోని స్వరాలయ స్టూడియోస్‌లో కళా సేవకుడు చెన్నా తిరుమలరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అచ్యుతరావు మాట్లాడుతూ కళలు, కళాకారుల అభ్యున్నతి కోసం ఆహర్నిశలు శ్రమిస్తున్న తిరుమల రావును సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు విశ్వప్రసాద్, హర్ష ప్రియ, మనోహర్, కోమలి, శివనారాయణ, దుర్గ, బొమ్మిడి సత్యనారాయణ, మాధురి, ఎస్.ఎన్.రావు, సాత్విక, ఎస్ఎస్ఎన్ రాజు, కృష్ణవేణి, మనో, అఖిల పాడిన పాటలు అలరించాయి.

## 3 నుంచి ధ్యానమందిరం వార్షికోత్సవాలు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం : రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పల్లకీ సేవలో మహిళలు తరించారు. అనంతరం ధ్యానమందిరం 30వ వార్షికోత్సవం, దసరా సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల కరపత్రికను ఆవిష్కరించారు. అక్టోబరు 3 నుంచి 12 వరకు వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు. తర్వాత ఓమ్ని ఆర్కే (గిగిల్స్), మాక్స్‌విజన్ ఐ కేర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మహదేవ్ అప్పారావు, సిరిపురపు తిరుపతి రావు, దేవిక, పద్మజ, భాగ్యశ్రీ, గౌరినాయుడు, సతీష్, వేదవతి పాల్గొన్నారు.

## హోరాహోరీ పోరులో రవికుమార్ విజయం

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా రైల్వే మెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ సెమీస్‌లో అభిషేక్ యాదవ్(దక్షిణ రైల్వే), రవికుమార్(తూర్పురైల్వే) మధ్య హోరాహోరీగా పోరు సాగింది. 67 కిలోల వెయిట్ కేటగిరీలో జరిగిన ఈ పోటీలో ఇరువురు పంచ్‌లతో దాడి చేసుకోగా రవికుమార్ చివరికి 4–3తో విజయం సాధించాడు. 48 కిలోల వెయిట్‌లో సీహెచ్ ఉపేంద్ర(తూర్పు తీర) 4–1తో కె.సంజిత్‌సింగ్(తూర్పు)పై గెలుపొందాడు.

## సంగం - శరత్ థియేటర్ వద్ద ఫ్యాన్స్ గొడవ


సంగం - శరత్ థియేటర్ వద్ద పోలీసులతో అభిమానులు

సీతమ్మధార : జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' చిత్రం విడుదల సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులు, పోలీసుల మధ్య గురువారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. థియేటర్ వద్ద డీజే ఏర్పాటుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో కొంత మంది అభిమానులు నిరసనకు దిగారు. వారిని అదుపు చేసేందుకు ఫోర్తుటౌన్, ద్వారకా, మహారాణిపేట పోలీసులు చేరుకున్నారు. దీంతో కొన్ని గంటలపాటు ఆ ప్రాంతమంతా ఘర్షణ వాతావరణం నెలకొంది. తర్వాత పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి డీజే ఏర్పాటుకు అభిమానులు అనుమతి తెచ్చుకొని సంబరాలు చేసుకున్నారు.